రైల్వేస్టేషన్లో నకిలీ వెండర్స్ దందా!

- స్టేషన్‌లో పుట్ట గొడుగుల్లా అనధికారిక వెండర్స్
- బడా కాంట్రాక్టర్ కనుసన్నల్లోనే దందా
- నకిలీ ఐడీ కార్డులతో యథేచ్ఛగా విక్రయాలు
- ప్రయాణికుల ఆరోగ్యానికి ముప్పు
- అధికారులకు తెలిసినా చర్యలు శూన్యం


విజయవాడ రైల్వే స్టేషన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): భారతీయ రైల్వేలోనే అతిపెద్ద రైల్వే స్టేషన్‌లలో ఒకటైన విజయవాడలో ప్రతి రోజూ లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతటి ప్రాధాన్యత కలిగిన విజయవాడ రైల్వే స్టేషన్‌లో నకిలీ వెండర్స్ దందా యథేచ్ఛగా సాగుతోంది. అధిక ధరలకు విక్రయాలు, నాసిరకం ఆహార పదార్థాలతో ప్రయాణికుల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు.

విషయం ఇదీ..

విజయవాడ రైల్వేస్టేషన్‌లో పది ప్లాట్‌ఫాంలలో సుమారు 80 నుంచి 90 వరకు వివిధ స్టాల్స్ ఉన్నాయి. ప్రయాణికులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం మాత్రమే అందించే లక్ష్యంతో రైల్వేశాఖ క్యాంటీన్‌లు, స్టాల్స్ నిర్వాహకులకు మార్గనిర్దేశాలు జారీ చేసింది. అందులో ఒక్కో స్టాల్‌లో షిఫ్టునకు నలుగురు చొప్పున విక్రయాలు చేసుకునే విధంగా నాలుగు వెండర్ పర్మిట్‌లతో పాటు మూడు షిఫ్టుల్లో మొత్తం పన్నెండు మంది వెండర్స్‌కు అనుమతులు ఉంటాయి. ఈ వెండర్స్‌కు ఎంటువంటి నేర చరిత్ర లేదని నిరూపిం చుకుంటూ స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. అటువంటి వారికే రైల్వే కమర్షియల్ అధికారులు స్టేషన్‌లో విక్రయాలు చేసుకునేందుకు గుర్తింపు కార్డులను మంజూరు చేస్తారు.

ప్రయాణికుల భద్రతకు ముప్పు..

అనాధికార వెండర్స్‌తో ప్రయాణికుల భద్రతకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు ప్రయాణికులు అభిప్రాయ పడుతున్నారు. రైల్వేశాఖ నిర్ధారించిన వెండర్స్ పూర్తి వివరాలు, నేర చరిత్ర, పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నాడా లేదా అని తనిఖీ చేసిన అనంతరమే ఐడీ కార్డులు మంజూరు చేస్తారు. కానీ ఈ అనాధికారిక వెండర్స్, నకిలీల వలన నేరచరిత్ర, ఆరోగ్య సమస్యలు తెలియకపోవడంతో వారి వలన ముప్పువాటిల్లే ప్రమాదం లేకపోలేదు.


తయారీ, గడువు తేదీలు లేకుండా విక్రయిస్తున్న ఆహార ప్యాకెట్‌లు

నాసిరకం ఆహారం విక్రయాలు..

రైలు ప్రయాణికుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న రైల్వేశాఖ నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం విక్రయించేలా మార్గదర్శకాలు అమలులో ఉంటాయి. కానీ రైల్వే స్టేషన్‌లో మాత్రం అవేవి పట్టించుకున్న దాఖలాలు కనిపించవు. కొన్ని స్టాల్స్ నిర్వాహకులు ఆదాయమే లక్ష్యంగా నాసిరకం ఆహారం విక్రయాలు సాగిస్తున్నారు. స్టేషన్‌లో విక్రయించే బిర్యానీ ప్యాకెట్‌లు, వెజ్ మీల్స్, ఇతర ప్యాకింగ్ ఫుడ్‌ల ప్యాకెట్‌లపై తయారీ తేదీ, గడువు తేదీ ఎక్కడా కనిపించవు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు వాటినే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.

అధికారులు చర్యలు తీసుకోవాలి..

ఈ వ్యవహారాలపై రైల్వే కమర్షియల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై ప్రయాణికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు ప్లాట్‌ఫాంలపై కమర్షియల్ సిబ్బంది ప్రతి ప్రయాణికుని వద్దకు వెళ్లి టిక్కెట్‌లు ఏవిధంగా తనిఖీలు చేస్తున్నారో అదే విధంగా వెండర్స్‌ను కూడా వారి పర్మిట్, ఐడీ కార్డులను తనిఖీ చేస్తే ఈ అనధికారిక వెండర్స్ దందా తగ్గుతుందని ప్రయాణికులు చెప్తున్నారు.

బడా కాంట్రాక్టర్ కనుసన్నల్లోనే..

రైల్వే స్టేషన్‌లో ఎక్కువ స్టాల్స్ దక్కించుకున్న ఒక బడా కాంట్రాక్టర్ కనుసన్నల్లోనే ఈ అనాధికారిక వెండర్స్ దందా యథేచ్ఛగా సాగుతుంది. ఒక్కో స్టాల్స్ నుంచి కేవలం నలుగురు మాత్రమే విక్రయాలు సాగించుకోవాల్సి ఉంది. రైలు ఆగే తక్కువ సమయంలోనే ఎక్కువ అమ్మకాలు చేసుకునేందుకు నకిలీ ఐడికార్డులు, వెండర్ పర్మిట్‌లు లేకుండానే వందల సంఖ్యలో అనధికార వెండర్స్‌తో అధిక ధరలకు విక్రయాలు చేయిస్తూ లక్షల ఆదాయం ఆర్జించుకుంటున్నారు.


విజయవాడ స్టేషన్‌లో విక్రయాలు చేస్తున్న అనధికార వెండర్స్

తనిఖీలు చేపట్టి పెనాల్టీలు వేస్తున్నాం..

రైల్వే స్టేషన్‌లో అనధికారిక వెండర్స్‌పై తరచూ తనిఖీలు చేసి పెనాల్టీలు విధిస్తున్నాం. అయినా కూడా అనాధికారిక వెండర్స్ తగ్గడం లేదు. దీనిపై సెక్యూరిటీ విభాగంతో సమన్వయం చేసుకుని పూర్తి స్థాయిలో వారిని కట్టడి చేసే దిశగా చర్యలు తీసుకుంటాం.

– అలీఖాన్, డీసీఎం

క్లుప్తంగా

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు ఉచిత వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు వేసవి విజ్ఞాన తరగతులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో పుస్తక పఠనం , పుస్తక సమీక్షలు, స్పోకెన్ ఇంగ్లిష్, జీకే, సోషల్, తెలుగు, మ్యాథ్స్, భగవద్గీత శ్లోకాలు, యోగ తదితర అంశాలపై తరగతులు, ఆటల పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఈ వేసవి సెలవుల్లో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు.

నేటి నుంచి త్యాగరాజస్వామి జయంతి ఉత్సవాలు



విజయవాడకల్చరల్: శ్రీసద్గురు సంగీత సభ ఆధ్వర్యాన ఈ నెల 27వ తేదీ ఆదివారం ఉదయం 9 నుంచి మే 4వ తేదీ రాత్రి 9 గంటలవరకు సద్గురు త్యాగరాజస్వామి ఆరాధాన సంగీతోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ వివరాలను సంగీత సభ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్ శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహించే సంగీత ఉత్సవాల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్వాంసులు కచేరీలు నిర్వహిస్తారన్నారు. ప్రధాన కార్యదర్శి పోపూరి గౌరీనాథ్ మాట్లాడుతూ యువ సంగీత కళాకారులకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. గాయనీ గాయకులు త్యాగరాజస్వామి రచించిన గీతాలను గానం చేయాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు బి.హరిప్రసాద్, సహాయ కార్యదర్శి జీఎస్ఎస్ ప్రసాద్ శర్మ, సభ్యులు గాయత్రి గౌరీనాథ్ పాల్గొన్నారు. అతిథులు కార్యక్రమ వివరాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

యోగా, ధ్యానంతో ఒత్తిళ్లను జయించవచ్చు

లబ్బీపేట(విజయవాడతూర్పు): యోగా, ధ్యానంతో ఒత్తిళ్లను జయించవచ్చని ఎంజీఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడిసిన్ హెడ్ నవీ ముంబయిలోని అపోలో ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్ డాక్టర్ సందీప్‌రాయ్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో శనివారం ప్రస్తుత సమాజంలో ఒత్తిళ్లు.. సహజ యోగ ప్రక్రియతో ఎదుర్కొనే పద్ధతులపై కళాశాలలో అకడమిక్ బ్లాక్‌లో సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో డాక్టర్ సందీప్‌రామ్ మాట్లాడుతూ ఎంత బిజీగా జీవితాన్ని గడుపుతున్నా, సమాజంలో ఎదురయ్యే ఒత్తిళ్లను తగ్గించుకోవాలన్నారు. లేకపోతే అనేక రుగ్మతలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.సహజయోగ ధ్యాన ప్రక్రియలు, వైద్య విధానంతో ఒత్తిళ్లను జయించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీఎం అసోసియేట్ ప్రొఫెసర్ ఎ.ప్రభాకర్, విజయశ్రీ, యోగా ట్రస్టు ప్రతినిధులు అడపా రామ్మోహనరావు, ఎస్ శంకర్, దేసు జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

యువ సంగీత విద్వాంసులకు ఆదర్శం 'అన్నవరపు'

విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు అన్నవరపు రామస్వామి సంగీత సేవలు వెలకట్టలేనివని స్వరఝరి సంగీత సంస్థ ప్రధాన కార్యదర్శి మోదుమూడి సుధాకర్ అన్నారు. ఆయన యువ సంగీత విద్వాంసులకు ఆదర్శమని చెప్పారు. స్వరఝరి 37వ వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో శనివారం వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామికి చింతలపాటి రాజ్యలక్ష్మి స్మారక పురస్కారం, మల్లాది కార్తీక త్రివేణి శాస్త్రీయ సంగీత కచేరి, గ్రంథావిష్కరణ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది వేములహజరత్తయ్య గుప్తా, మల్లాది సూరిబాబు, అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. వీణ విద్వాంసులు వీఎల్ నారాయణ రచించిన జనకరాగ గ్రహబేధ మంజరి గ్రంథాన్ని సంగీత కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసమ్మ ఆవిష్కరించారు.

ముఠా కార్మిక హక్కుల పరిరక్షణకు చట్టాలు అవసరం


ముఠా కార్మికుల ప్రదర్శన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అసంఘటిత రంగంలోని ముఠా కార్మికుల హక్కుల పరిరక్షణకై చట్టాలు తీసుకురావాలని సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ ముఠా కార్మిక సంఘం 43వ మహాసభ సందర్భంగా కార్మికులు పాతబస్తీ లెనిన్ భవన్ వద్ద నుంచి ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన సామరంగం చౌక్, గుడివాడ వారి వీధి, మెయిన్ బజార్ ప్రాంతాల మీదుగా ముందుకు సాగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎటువంటి చట్టం లేనటువంటి ముఠా కార్మికుల జీవితాలకు భద్రత లేకుండా పోయిందన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు లేకపోవడంతో వృద్ధాప్యంలో వారికి ఎటువంటి భద్రత లేదన్నారు. దశాబ్దాల కొలది యజమాని దగ్గర పనిచేసే ముఠా కార్మికుడు, తాను పనిచేస్తున్న యజమాని నగరం నుంచి నగర శివారు ప్రాంతాలకు తన వ్యాపారాన్ని తరలిస్తే, యాజమానితో పాటు ముఠా కార్మికులను కూడా అక్కడ పని చేయించుకునేందుకు తీసుకెళ్లటం న్యాయమని, అట్లా కాకపోతే దశాబ్దాలకు ఆ యజమానుల దగ్గర పనిచేసిన ముఠా కార్మికుడు తన జీవనోపాధి కోల్పోతున్నారన్నారు. నేడు పెరిగిన ధరలకు జీవనాన్ని కొనసాగించ లేని కార్మికులకు సొంత ఇళ్లు లేని దుస్థితి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని ముఠా కార్మికులకు ఇంటి స్థలం, ఇచ్చి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసేందుకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, ముఠా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వియ్యపు నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు కేఆర్ ఆంజనేయులు, ముఠా కార్మిక సంఘం నగర అధ్యక్షుడు చొప్ప శ్రీరామచంద్రమూర్తి, సంఘం నాయకులు బోను చిన్న శ్రీరాములు, బత్తుల తిరుపతయ్య, నాగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బైపిళ్ళ సత్యనారాయణ, మరిపిళ్ళ మధు, జగదాపు సన్యాసిరావు, కాకి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ శాంతిర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కమిటీ పాలకవర్గం, విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉగ్రవాదానికి రూపుమాపేందుకు అందరూ కృషి చేయాలని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షులు తొమ్మండ్రు శేషయ్య అన్నారు. పహల్గాం ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో శనివారం శాంతి ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం శేషయ్య మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిని పిరికిపందల చర్యగా అభివర్ణించారు. అమానుషమైన రీతిలో ఉగ్రవాదులు చేసిన దారుణ మారణకాండను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కుల, మత, ప్రాంత, జాతి, వర్గ భేదాలు లేకుండా దేశపౌరులంతా సమైక్యంగా ఉండటాన్ని జీర్ణించుకోలేక ఉగ్రవాదులు ఇలా దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ పహల్గాం వంటి చర్యలు పునరావృతం కాకుండా భారతప్రభుత్వం ఉగ్రవాదులకు శాశ్వతంగా బుద్ధి చెప్పాలన్నారు. అమాయకులైన ప్రజల ప్రాణాలు తీయడం ఉన్మాద చర్యగా అభివర్ణించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ పహల్గాం దుర్ఘటన దేశచరిత్రలో చీకటి అధ్యాయంగా అభివర్ణించారు. శాంతిర్యాలీలో కళాశాల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, టి.శ్రీనివాసు, కోశాధికారి ఎంవీకే హరగోపాల్, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ విజయభాస్కర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎన్.సాంబశివరావు, వైస్ ప్రిన్సిపాల్స్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, కె.రామకృష్ణ, భారీసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి అమానుషం..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి అత్యంత కిరాతక చర్య అని విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు గద్దం బాల వెంకటరవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యాటకులపై ఉగ్రవాదుల దుశ్చర్యను అందరూ ఖండించాలన్నారు. బాధిత కుటుంబాలకు అందరూ అండగా ఉండాలని సూచించారు .

మధురై కార్పొరేషన్‌లో అమృత్ ప్రాజెక్ట్ అధ్యయనం


మధురై కార్పొరేషన్ వద్ద వీఎంసీ కార్పొరేటర్లు

పటమట(విజయవాడతూర్పు): మధురై ప్రజలకు రూ. 2 వేల కోట్లతో 24/7 తాగునీటి సరఫరా జరుగుతోందని మధురై మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఇంద్రాణి పొన్వసంత్ వీఎంసీ కార్పొరేటర్లకు తెలిపారు. విజ్ఞాన యాత్రలో వీఎంసీ కార్పొరేటర్లు శనివారం అన్నమలైలోని మధురై మున్సిపల్ కార్పొరేషన్‌ను సందర్శించారు. తొలుత కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని సమావేశ గదిలో వీఎంసీ డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, టీడీపీ డెప్యూటీ ఫ్లోర్‌లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లకు స్వాగతం పలికారు. మేయర్ ఇంద్రాణి పొన్వసంత్, కమిషనర్ చిత్ర విజయన్ అభివృద్ధి పనులను వీఎంసీ కార్పొరేటర్లుకు వివరించారు. మధురై నగరంలో 100 వార్డులు, ఐదు జోనులు ఉన్నాయని, తమిళనాడు రాష్ట్రంలో రెండో అతిపెద్ద కార్పొరేషన్ అని చెప్పారు. తమిళనాడు అసెంబ్లీలాగా ఉన్న వారి కౌన్సిల్ హాల్‌ను చూపించారు. మధురై నగరం స్మార్ట్ సిటీ అని, పెరియార్ బస్టాండ్‌ను రూ.174.56 కోట్ల నిధులతో ఐదు అంతస్తులు నిర్మించారని చెప్పారు. కార్పొరేటర్లు భవన స్ట్రక్చర్, వాటర్ డ్రైన్ సాంపులు, వర్షం నీటిని ఫైర్ సేఫ్టీ కోసం వాడుతున్న విధానాన్ని అధ్యయనం చేసి విజయవాడలో కూడా ఇటువంటివి ఎంతో ముఖ్యమైనవని వీటి అమలుకు ప్రణాళికను రూపొందిస్తామని కార్పొరేటర్లు తెలిపారు.

చిన్నారులకు దుస్తుల పంపిణీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కబేళా రోడ్‌లోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం (జువెనైల్ హోమ్)లోని చిన్నారులకు శనివారం వీకె యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ (వసుధైక కుటుంబం) వలంటీర్ శ్రీహరి సత్యనారాయణ నూతన దుస్తులు పంపిణీ చేశారు. కృష్ణా జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు రాధాకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది గొట్టిపాటి రామకృష్ణ మాట్లాడుతూ చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని చిన్నారులకు సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏకె బాషా మాట్లాడుతూ నేరాలపై పిల్లలకు అవగాహన కల్పించడం ద్వారా వారిలో నేరప్రవృత్తికి దూరంగా ఉంచవచ్చని పేర్కొన్నారు. రాధా కుమారి మాట్లాడుతూ చిన్నారులకు చేయూనిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు డి.దుర్గారావు, హోమ్ సూపరింటెండెంట్ పీ రామ్మోహన్‌రెడ్డి, ప్రొహిబేషన్ అధికారి హసన్ అలీ బేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రాణాలకు భద్రత

అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్


మాట్లాడుతున్న త్రిమూర్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ట్రాఫిక్ నిబంధనలను పాటించినప్పుడే ప్రాణాలకు భద్రత ఉంటుందని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్కే త్రిమూర్తులు అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ లీడ్ ఏజెన్సీ సహకారంతో రోడ్డుపై భద్రతా నియమాలపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. యువత మితిమీరిన వేగంతో వాహనాలను నడపరాదని, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ ఎల్లప్పుడూ తమ వద్ద ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ సింబల్స్, జీబ్రా లైన్స్ వద్ద పాటించవలసిన నియమాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ల ద్వారా వివరించారు. మరో ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు భద్రత పరిరక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, ఫిజికల్ డైరెక్టర్ విక్టర్ జాన్సన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఠాగూర్ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని గ్రేడ్-1 గ్రంథాలయ అధికారి కంచల నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వేసవి సెలవులు వినియోగించుకోవడానికి ఏపీ పౌర గ్రంథాలయ శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని పేర్కొన్నారు. నగరంలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఈ నెల 28వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణ శిబిరంలో పిల్లలకు కథలు చెప్పడం, పుస్తక సమీక్షలు, పుస్తకాలు చదివించడం, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పడం, చిత్రలేఖను నేర్పించడం, పెద్దలతోవివిధ విజ్ఞాన దాయకమైన అంశాలపై ప్రసంగాలు, పేపర్ ఆర్ట్స్ నేర్పించడం వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన వివరించారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమాజానికి మేలు చేసేవారు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని పశ్చిమ జోన్ ఏసీపీ ఎస్ఎస్‌వీ కె.దుర్గారావు కొనియాడారు. భవానీపురం చర్చి సెంటర్‌లో జక్కిరెడ్డి పెద్దసుబ్బారెడ్డి (పెద్దాయన) సేవాస్ఫూర్తితో ఆయన జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని శనివారం ఏసీపీ దుర్గారావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇటువంటి కేంద్రాలు దోహద పడతాయన్నారు. జక్కిరెడ్డి పెద్దసుబ్బారెడ్డి తన జీవితంలో చేసిన సేవలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టిన కొండ్రెడ్డి ఓబుల్‌రెడ్డి, ఆయన మిత్ర బృందాన్ని అభినందించారు. ప్రజలకు ఏదో ఒక రూపంలో మంచి చేయాలని కోరుకునే వారికి ఎప్పుడూ మంచే జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బొమ్మారెడ్డి ప్రసాదరెడ్డి, సైకం సుబ్బారెడ్డి, దాసరి రామకృష్ణ, వేల్పుల రాముడు, ఓబిరెడ్డి ప్రసాదరెడ్డి, చింతమరెడ్డి వెంకటరెడ్డి, గుజ్జుల వెంకటేశ్వరరెడ్డి, మూలె కోటిరెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఊర్మిళానగర్, భవానీపురం ప్రాంతవాసులు పాల్గొని జక్కిరెడ్డి పెద్దసుబ్బారెడ్డి సేవలను స్మరించుకున్నారు.



ఇండోర్ స్టేడియం పనుల పరిశీలన


ఇండోర్ స్టేడియం పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విద్యాధరపురం ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను ఇంజినీరింగ్ సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా శనివారం ఆయన విద్యాధరపురం స్టేడియం, నైజాం గేట్ ఔట్‌ఫాల్ డ్రైన్, ఆర్టీసీ వర్కుషాప్ రోడ్డు, లేబర్ కాలనీ, ఔట్‌ఫాల్ డ్రైన్, విద్యాధరపురం అన్న క్యాంటీన్, పంజా సెంటర్ ప్రాంతాల్లో పర్యటించారు. నైజాం గేట్ ఔటఫాల్ డ్రైన్, ఆర్టీసీ వర్కుషాప్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ఔట్ ఫాల్ డ్రైన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి జరుగుతున్న డీసిల్టింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇంజనీరింగ్ సిబ్బంది, ప్రజారోగ్యం సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ ఫ్లోటింగ్ గార్బేజ్, సిల్ట్‌లను ఎప్పటికప్పుడు పరిశుభ్రపరుస్తూ డ్రైన్ ప్రవాహంలో ఎటువంటి అవాంతరం లేకుండా చూసుకోవాలన్నారు. పంజా సెంటర్‌లో పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. వారి ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు.ఈ పర్యటనలో ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణనాయక్, అన్నపూర్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేఖ, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఆర్‌కే డేవిడ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాచార హక్కు చట్టం పారదర్శకంగా అమలు చేయాలని ప్రజాపరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఆర్‌ఏ డేవిడ్ అన్నారు. శనివారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో సమితి ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాచార కమిషన్లు పూర్తి స్వేచ్ఛ, స్వతంత్రంగా పనిచేసేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాల ఫలితంగా ఆర్టీఐ చట్టం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ప్రకారం ప్రజలు కోరిన సమాచారాన్ని నిర్దేశించిన సమయానికి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు పర్వతనేని హరికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి పి.రవికుమార్, గౌరవ అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది పిచ్చుక శ్రీనివాసరావు, అడ్వకేట్ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 28 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు టి.క్రాంతికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి మే 28వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం.రత్నకమల్ బాబు క్లాసులు బోధిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలవారు 93985 26793, 94900 98408 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

వెళ్లే దారి లేదు.. కూర్చునే వీలులేదు


విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సరైన వసతి లేక అరుగులపై ఇలా..


ఓపీ కౌంటర్ల వద్ద ఇబ్బందే..





నగరంలోని పాత ప్రభుత్వాస్పత్రి ఆవరణలో కూర్చునే చోటు లేక.. వాహనాలు వెళ్లే దారి లేక రోగులు, వారి సహాయకులు ఇబ్బంది పడుతున్నారు. ఓపీ కౌంటర్ల వద్ద, స్కానింగ్, రక్త పరీక్షల వద్ద వేచి ఉండలేక, అక్కడ కూర్చునే అవకాశం లేక గర్భిణులు, చంటిపిల్లల తల్లులు.. అంబులెన్సులు, ఇతర వాహనాల వెళ్లే దారిలో అరుగుల వద్ద కూర్చుంటున్నారు. ఆస్పత్రి ఆవరణలో ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపుతుండటంతో అంబులెన్సులు, ఇతర వాహనాలు నిలిచిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితులు ఉన్నా ఆస్పత్రి ఉన్నతాధికారులు ఇక్కడ రోగులకు అవసరమైన వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్న జాడ కానరావడం లేదు. ఇలాంటి దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ